
కథ

# అది తప్పు చెయ్యలేదు

కాకాని చక్రపాణి



"ఏమే, రాదా? ఏం జేస్తన్నవే" అంటూ, ఇంట్లోకి వచ్చింది పక్కింటి యాదమ్మ.

"ఇప్పుడే అన్నం పడేసినా, అక్కా" అంది రాధ, వెనక్కి తిరుగుతూ. ఆమె అసలు పేరు రాజమ్మ. వెంకటేశం దగ్గరికొచ్చాక ఆమె తన పేరు రాధగా మార్చుకుంది.

"నీ మిండ మొగుడు ఊళ్ళో లేడా ఏంది?"

"లేదు, ఊళ్ళ పైకెల్పిండు. అయినా గట్ల మాట్లాడతవేందక్కా! మొగుడు అన రాదా! మిండమొగుడేంది?

"నీ అసలు మొగుడు బతికేఉన్నడు, గందే? మరి ఈడు మిండడు గాక మొగుడెట్లయితడు?"

"అదేంటక్కా! మగాడు ఎంతమందితో ఉన్నా, ఆడికంతా పెళ్ళాలే. పెద్ద పెళ్ళాం, చిన్నపెళ్ళాం అంటారనుకో. మరి ఆడదాయి కొచ్చేసరికి ఇంత అన్యాల మెందుకు?"

"మొదటిది పెళ్ళాం, రెండోది ఉంచుకున్నది అని కూడా అంటరు..."

"నేనీడికి పెళ్ళాన్నే. ఈడికి పెళ్ళికాలేదు"

"అంత బరవాసా ఏందే? ఆడు చెప్పిన మాటే గందా?"

"నేనంత తెలివితక్కువదాన్ని కాదక్కా! ఈడిని నమ్ముకుని వచ్చేసేంత పసిదాన్ని కాదు. అర్సుకున్నా, అప్పుడు కానీ ఈడితో రాలేదు. అయినా గోవిందును మర్చిపోలేకుంటినక్కా!" గోవిందు ఆమె మొదటి మొగుడు.

"ఆడ్ని కూడా తెచ్చిపెట్టుకో. కత మంచి రక్తి కడతది".

"తప్పేంది?"

"తప్పున్నర! పాపం పున్నెం సంగతొదిలెయ్. ఎర్రిమొకమా! పిల్లల్ని కనేది ఎవరే? ఆడదేనా? నలుగురు నడిచే తోవన మొక్కలు మొలవవంటరు. అట్టాంటి ఆడదానికి


పిల్లలు పుట్టరు. ఒకేళ పుట్టినా, ఆళ్ళు పెద్దమొగడి పిల్లలా, చిన్నమొగడి పిల్లలా ఎవరు తేలుస్తరు. అందుకనే ఈ కట్టడి చేసిన్రని మా ఇంటోడు చెప్పిండు. మొగోడు ఎంత మందినయినా కట్టుకోవచ్చునంట, ఆడది మాత్రం ఒక్క మొగాడితోనే ఉండాలంట!''

యాదమ్మ విషయాన్ని విడమర్చి చెప్పినా, రాధకు సమర్థింపు కలుగలేదు.

''నీకు సమఝుకాలే. అసలు సంగతి చెప్తనినుకో. ఆడదాన్నికున్న ఓర్పు మగోడికుండదు. మగడు ఇంకోదాని దగ్గర పడుకోనొచ్చినా ఆడది ఓర్చుకుంటాది. మొగోడు ఓర్వలేడు. ఆడది ఆడి సొంతం. పరాయోడ్ని కన్నెత్తి చూసినా సయించుకోలేడు. నీ మిండడి తాన గోవిందు ఊసెత్తు. ఆడు నీ బొక్కలిరగ్గొట్టకపోతే నా పేరు యాదమ్మ కాదు. ఇనకుంటివా, రక్తపాతం అయిపోతాది''.

రాధ సమస్య అదే. ఆమెకు తన మొగుడు గోవిందు మీద ప్రేమ చావలేదు. అతడి దగ్గరి బతుకులో సుఖం లేదు. అందుకే ఆమె వెంకటేశం గాలం వెయ్యగానే తగులుకుంది. రాధ ఆలోచనల్లోకి జారుకోవటంతో, యాదమ్మ, ''సర్లే, నీ మనసీడున్నట్లు లేదు. మళ్ళస్త'' అని తన ఇంటికి పోయింది.

'తమది మహబూబ్‌నగర్ జిల్లా, బిజినేపల్లి. తనకు చిన్నతనానే మనువయినాది. గోవిందుదీ, తనదీ ఒకటే ఊరు. అప్పటికి తన మామ కొద్దిపాటి రైతే. నాలుగు ఎకరాల భూమి ఉండేదంట. వానల్లేక, పంటలు పండకా, పెద్ద కుటుంబమయ్యీ, ఒకొక్క ఎకరమూ అమ్మటం మొదలెట్టినాడు మామ. తన పెళ్ళయ్యే నాటికి ఒక ఎకరం మాత్ర ముండె. తనమొగుడి కంటే పెద్దోళ్ళు ఇద్దరి ఆడబిడ్డల పెండ్లిండ్లూ అయినప్పటికే ఇంట్లో పెద్దమ్మ వచ్చికూర్చున్నాది. కొడుక్కి పెళ్ళిచేస్తే ఏదో లప్పమొచ్చి ఇంట్లో పడుతుందను కున్నాడు మామ. తన తండ్రికి పైసలొదిలుండె గానీ, ఈయ్నకు మిగిలిందేమీ లేకుండె...'




పొయ్యిమీద కూరమాడిన వాసన వస్తుంటే, రాధ లోపలికి పరుగెత్తింది.

మహబూబ్‌నగర్ జిల్లా వలస కూలీల సమస్యతో ఎప్పటి నుండో అట్టుడికిపోతోంది. చిన్నచేపను పెద్ద చేప మింగటం ప్రకృతిలో ఉన్నదే. సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఉన్న వాళ్ళు, లేనివాళ్ళు సమాజంలో రెండు వర్గాలని అన్నారు. ఉన్నవాడు లేనివాడిని దోచుకుతింటాడు. భూమి పరిమితమయింది. దాని కోసం కొట్లాట అనాది నుండి కొనసాగుతూనే వస్తున్నదే. ఆదిమ సమాజం భూస్వామ్య వ్యవస్థకు దారి తీసింది. పారిశ్రామీకరణతో పట్టణాలు, మిల్లులు, ఫ్యాక్టరీలు, మురికివాడలు, కూలీలు, పెట్టుబడిదారులు – అన్నీ, అందరూ వచ్చాయి, వచ్చారు. భూస్వామ్యవ్యవస్థ పూర్తిగా అంతరించకుండానే, పెట్టుబడిదారీ విధానం అమలులోకి వచ్చేసింది. తెలివి మదుపు పెట్టి పైకి వచ్చిన బీదవాడు కూడా దోపిడీలో భాగస్వామ్యం వహించాడు.

తెలంగాణలోనే మహబూబ్‌నగర్ జిల్లా బాగా వెనకబడిన జిల్లా. వర్షాభావ పరిస్థితులు, ఉపాధిలేమి రైతులను కూలీలుగా మార్చటమే కాక వలసపోయేందుకు కూడా సిద్ధం చేసింది. అప్పుడు అవతరించింది గ్రూపు మేస్త్రి – గుంపు మేస్త్రి వ్యవస్థ. వీళ్ళు చిన్న తరహా పెట్టుబడిదారులు. భారీ పరిశ్రమలు పెట్టలేరు. పెద్దగా చదువుకున్న వాళ్ళు కాదు. మాటలతో పనివెళ్ళదీయగల నేర్పరులు. అవసరపడినప్పుడు చేయినీ తిప్పగలరు. ఆ అవసరం పడకుండా చూసుకుంటారు. గుంపు మేస్త్రీలు ఊళ్ళల్లో తిరుగుతారు. పేదవాడి కంటే పెద్ద సామాజిక స్థాయి ఏం ఉండదు అతడికి. స్థానికమయిన మనిషి, అందువల్ల జనం అతన్ని నమ్ముతారు. అతనికీ ఏ మనిషి ఎలాంటివాడో తెలుసు. రైతులకు సవాలక్ష అవసరాలుంటాయి. కూతురి పెళ్ళి, మరో సందర్భం, చావు పుట్టుకల మధ్య నడమంతరపు వేడుకలెన్నో. అన్నింటికీ డబ్బు కావాలి. అప్పు చేస్తారు. అన్నీ సరిగ్గా ఉంటే అప్పులు తీర్చుకోవచ్చు. అలా సరిగా ఉండటం ప్రకృతికి విరుద్ధం. పంటలు పండవు. లేదూ మరో అవసరమొచ్చి పడుతుంది. ఋణదాత గొంతు మీద కూర్చుంటాడు. పరమాత్మలా అప్పుడు అవతరిస్తాడు గుంపు మేస్త్రీ. "నీ అప్పు తీర్చేస్తానంటాడు' లేదూ 'నీ అవసరానికి అప్పు ఇస్తాన'ంటాడు. ఓ కుటుంబంలోని మనుషుల వయసు, బలం, కష్టం చెయ్యగల ఓరిమి అంచనా వేసి ముప్పయి, యాభై వేలు, లక్ష – ఒకోసారి లక్షన్నర వరకూ కూడా అప్పుఇస్తాడు. అత్త-మామ, కొడుకు-కోడలు అంతా కలిసి వచ్చి పని చేస్తామంటేనే పెద్దమొత్తాల్లో అప్పు ఇవ్వటం జరుగుతూంది. అది పెద్ద ప్రలోభం. దిగితే గాని అది అగాధమని తెలియదు. అప్పు ఇచ్చిన మేరకు ప్రామిసరీ నోటు రాయించుకుంటాడు గుంపు మేస్త్రీ. దీని అవసరం ఎప్పుడో గాని పడదు మేస్త్రీకి. సర్వ సాధారణంగా అప్పు ఎగగొట్టట ముండదు. ఆ జాగ్రత్తలన్నీ తీసుకుంటాడు గుంపు మేస్త్రి.

ఇలా కూలీలుగా మారిన రైతులను, వారి కుటుంబాలతో సహా సాధారణంగా ఇతర రాష్ట్రాలకు తీసుకు వెళ్తుంటాడు గుంపు మేస్త్రి. అక్కడ పనిలో ఉంటాడు గ్రూపు మేస్త్రి. ఈ కూలీలను గుంపు మేస్త్రి గ్రూపు మేస్త్రికి అప్పచెబుతాడు. అతను వీళ్ళను ఒక కంట్రాక్టరు కింద పనిలో పెడతాడు. అతడు చెప్పిన పని – అది భవంతులు, ప్రాజెక్టుల నిర్మాణమో – ఏదయినా సరే వీళ్ళు చెయ్యాలి. వీళ్ళ దగ్గర పని తీసుకోటం వరకే కంట్రాక్టరుకూ, వీరికి ఉన్న సంబంధం. వీళ్ళకు సంబంధించిన మిగతా విషయాలను గ్రూపు మేస్త్రీ చూసుకుంటాడు. అక్కడ ఉండటానికి గుడిసె ఇస్తాడు, మూడు పూటలా తిండి పెడతాడు. నెలకు మనిషికి పదిహేను వందల కూలీ ఇస్తాడు. చేతికేమీ ఇవ్వడు. బాకీ కింద జమ కట్టుకుంటాడు. రోజూ ఆరు గంటల పని. నెలకు రెండు రోజులు శలవు ఉంటుంది. జ్వరం వచ్చినా, జబ్బొచ్చినా పని ఎగగొట్టడానికి వీలు లేదు. తన బదులు ఇంకో వ్యక్తిని పనిలోకి పంపాలి. ఆ రోజు సెలవులో ఉన్న కూలీ ఈసాయం చేస్తాడు. డాక్టరు, మందు ఖర్చులు మేస్త్రీ ఇస్తాడు. కానీ ఇవన్నీ అప్పుకింద జమవుతాయి. అయితే లెక్కల్లో మాత్రం ఏ తభావతూ ఉండదు. కచ్చితంగా ఉంటాయి. లెక్కల పరంగా కూలీని మోసం చెయ్యటం మాత్రం జరగదు. ఇలా ఏడాదికి పది నెలల పని ఉంటుంది. వర్షాకాలం రెండు నెలలు ఇంటికి తిరిగి వచ్చెయ్య వచ్చు.




ఇది పరిణామక్రమంలో పటిష్ఠంగా రూపుదిద్దుకున్న ఓ వ్యవస్థ. మహా కట్టుదిట్టంగా అమలవుతుంది. ఈ గ్రూపు మేస్త్రీ – గుంపు మేస్త్రి వ్యవస్థకు రాజకీయ నాయకుల అండ కూడా వుంటుంది. ప్రభుత్వాలు ఈ వ్యవస్థను భగ్నం చెయ్యాలని ప్రయత్నం చేస్తున్నాయి కానీ అదంత తేలికకాదు. ఇప్పుడు కొత్తగా ప్రవేశపెట్టిన 'ఉపాధి హామీ పథకం' దీన్ని రూపుమాపలేదు. ఇది ఆక్టోపస్‌లాంటిది. చేతికి చిక్కదు. తనకు చిక్కిన వారిని గ్రసించి వేస్తుంది.

గోవిందు తండ్రి సైదులు మూడో కూతురి పెండ్లికి ఇరవై వేలు అప్పుచేశాడు. చేసేటప్పుడే అతనికి తెల్సు – తను ఆ అప్పు తీర్చలేనని. అయితే కూతురు లగ్గం. అదయ్యాక చూసుకోవచ్చు. ఆ అప్పుతీర్చనే లేదు. పురుళ్ళు, పుణ్యాలు, రోగాలు, రొష్టులు, చావులు, పంటలేక పోవటం లాంటి సవాలక్ష కారణాలతో, వడ్డీ కలిపి యాభైవేలు దాటిపోయింది. ఊరి సత్తెయ్యసేటు బాకీ తీర్చమని లగాలగీ చేశాడు. భార్య పోయిన కొత్తలు. ఆ దిగులుతో మంచం పట్టాడు సైదులు. అప్పుడు కూలీల వేటలో ఉన్నాడు ఈశ్వరయ్య మేస్త్రీ. సైదులుకు భరవాసా ఇచ్చాడు ఈశ్వరయ్య.

"నీ కొడుకు, కోడల్ని పనిలోనికి పంపు. నీ యాభై వేల అప్పు తీర్చేస్తా" అన్నాడు.

"ఆడదాయినేడ పంపిస్త, తమ్మి! నే నొస్త" అన్నాడు సైదులు.

"ఓర్నియవ్వ, నువ్వేం పని జేస్తవే. నీతోన కాదు గని నీ కోడల్ని పంపు" అన్నాడు ఈశ్వరయ్య.

గోవిందుకు కూడా పెళ్ళాన్ని పనికి తీసుకెళ్ళటం ఇష్టం లేదు. కానీ, తను చెయ్యాల్సిన పనేమిటో, అదెంత ఒళ్ళు హూనం చేసేపనో అవగాహనలేని తనంతో, మొగుడిని విడచి పెట్టి ఉండలేని విరహంలో తను కూడా వస్తానని పట్టుబట్టింది. ఆనాటి రాజమ్మ.

"ఎంతయ్యా! రెండేళ్ళు ఇద్దరం కష్టపడిన మంటే బాకీ చుప్తాగా తీరిపోద్ది. దీనికింత సోచాయించాల్నటయ్య!" అంది.

"నీకు తెలీదే! పొలంల పని చేసినట్టుకాదు. కష్టమెక్కువ. అదీ ఎక్కడనో పరాయి దేశంల" అని ఆమెకు నచ్చ చెప్ప ప్రయత్నించాడు గోవిందు.

కానీ ఆమె మొండిపట్టు పట్టింది, తనూ వస్తానని. గోవిందుకు కూడా పెళ్ళాన్ని విడచిపెట్టి వెళ్ళటం కష్టమే. తండ్రి ఇంకా నాలుగు రోజులు బతకాలంటే అప్పు తీర్చక తప్పదు. అంతే తనూ, తన పెండ్లాం పనికి వెళ్ళక తప్పదు.

ఋణపత్రంపై వేలి ముద్రవేశాడు గోవిందు. సైదులు వేస్తానంటే ఒప్పుకోలేదు ఈశ్వరయ్య. మాట ఇచ్చినట్లే అతను సత్తెయ్యసేటు బాకీ తీర్చేశాడు. గోవిందును, రాజమ్మను, మరి కొంతమంది కూలీలను కర్ణాటక ఆల్మట్టికి తీసుకెళ్ళాడు ఈశ్వరయ్య. అక్కడ కృష్ణానదిపై డ్యాం నిర్మాణం జరుగుతోంది. అక్కడ వెంకటేశం గ్రూపు మేస్త్రీ. వీరిని వెంకటేశంకి అప్పజెప్పి వెళ్ళిపోయాడు ఈశ్వరయ్య.

వెంకటేశం ఈశ్వరయ్య కంటే డబ్బున్నవాడు. చిన్నప్పుడే ఈ వ్యాపారం లోకి దిగి, గుంపు మేస్త్రీగా ఎదిగి, గ్రూపు మేస్త్రీ స్థాయికి చేరుకున్నాడు. అతని కింద మరి కొంతమంది గుంపు మేస్త్రీలు కూడా

ఉన్నారు. అతనికి ముప్పయి రెండేళ్ళు. పెళ్ళి చేసుకోలేదు. అవసరాలు తీరిపోతున్నాయి. అతనికి పెళ్ళి అవసరం కన్పించలేదు. రాజమ్మ పనిలో చేరిన ఐదు నెలలకు గానీ, ఆమెలోని అందాలు గమనించటం పడలేదు వెంకటేశానికి.

గోవిందుకు రాజమ్మ అంటే ఎంతో ఇష్టం. ఆమె తల్లిదండ్రులూ ఆమెను కలిగినంతలో అపురూపంగానే చూసుకున్నారు. నాలుగో క్లాసు దాకా చదువు కూడా చెప్పించారు. గోవిందు నిరక్షరకుక్షి. రాజమ్మ కూడబలుక్కుని పుస్తకం చదవగలదు. సంతకం పెట్టగలదు. ఆమె తల్లిదండ్రులు ఆమెను తమకంటే కొంత మెరుగయిన కుటుంబంలోకే మనువు చేసి పంపించారు. గోవిందు ఎవరికీ ఏం కష్టం కలగకుండా ఆ కష్టమేదో తను పడేవాడు. రాజమ్మ ఆల్మట్టికి రావటం అతని కేమాత్రం ఇష్టంలేదు. కానీ తప్పలేదు. వ్యవసాయ కూలీ పనులు చేసినా, ప్రాజెక్టుల పని అందుకు భిన్నం. అదిచాల శ్రమతో కూడుకున్నది. మొదట్లో రాజమ్మ ఆ పనికి తట్టుకోలేక పోయింది. తరచు పడక కూడా పెట్టేది. సాయంత్రం ఇంటికి వచ్చాక ఆమెను ఏ పనీ చేయనిచ్చేవాడు కాదు గోవిందు. గ్రూపు మేస్త్రీ నడిగి పైసలు అప్పుకు తెచ్చి వేడినీళ్ళు కాచి కాపు పెట్టేవాడు. స్నానం చేయించేవాడు. ఒళ్ళు వత్తేవాడు. ఆమె అలసి ఉన్నరోజుల్లో ఆమెకు దూరంగా ఉండే వాడు. తనకు కోరిక ఉన్నా నిగ్రహించుకునే వాడు. ఆమె పొందు కోరుకున్నప్పుడే అతడు దగ్గరయ్యేవాడు. అప్పుడు సుతారంగా వ్యవహరించేవాడు. ఒకోసారి ఆ ప్రవర్తన ఆమెను ఆగ్రహానికి గురిచేసేది. ''ఏంది నేనేమన్నా గాజు బొమ్మనా అట్ల చూస్తవు!'' అనేది.

ఒకరిపై ఒకరికి ఎంత ప్రేమాభిమానాలున్నా, భౌతిక పరిస్థితులు చీకాకు పర్చేవే. ఒకోసారి ఆమె అతనితో గిల్లి కజ్జాలు పెట్టుకునేది.

''మా పుట్టింట్లో నేనింత కష్టపడిందాన్ని కాదు. నిన్ను మనువాడినంకే నాకింత కష్టమొచ్చినాది'' అనేది.

''ఎకరాలు అమ్మించి అక్కరలు తీర్చుకున్న మీ అక్కలు మంచిగనే ఉండె. చచ్చిన మీ అమ్మ మంచిగనే ఉండె. కూర్చుంటే లెవ్వలేని మీ నాయన మంచిగనే ఉండె. అప్పు చేయించి పెళ్ళి చేయించుకున్న మీ చెల్లి మంచిగనే ఉండె. నా కొచ్చింది చచ్చిన చావు. మీనాయన చేసిన రుణానికి నేను నా పేణం తీసుకుంటుంటి'' అనేది.

ఆమె ఏమన్నా గోవిందు జవాబు చెప్పేవాడు కాదు. ఆమె మాటల్లో నిజం ఉంది. తన పైబడ్డ అప్పులు తీర్చటానికే ఆమె ఈ పనికి రావల్సి వచ్చింది. రెక్కలు ముక్కలు చేసుకోవాల్సి వచ్చింది.

అలా మొగుణ్ణి తిట్టిన కొద్దిక్షణాలకే ఆమె గోవిందును చూసి కరిగిపోయేది. ''పాపిష్టి దాన్ని! నాకు పుట్టగతులుండవు. ఇంత మంచి పెనిమిటిని ఎన్ని మాటలంటినో. నన్ను కొట్టు చంపు'' అనేది.

అతని చేయి తీసి తన చెంపలకు కొట్టుకునేది.

''ఆడుబిడ్డ మనువు బరువు నాది! మరెందుకు లొల్లి జెస్తి. తప్పు జేసిన మగడా'' అనేది.

పెళ్ళయి ఐదేళ్ళయినా వాళ్ళకు సంతానం కలుగలేదు. తనలో లోపం వల్లే తమకు పిల్లలు పుట్టలేదని ఆమె భావించేది. ఆ విషయంలోనూ తననే మాత్రం తప్పు పట్టని మొగుడి పట్ల విపరీతమయిన ప్రేమ పుట్టేది.

ఇట్లా కొట్లాటలు, అనునయాలు, బుజ్జగింపులతో ఐదు నెలలు గడిచిపోయాయి. ఓ రోజు పొద్దున లేవలేక పోయింది రాజమ్మ. చెయ్యేస్తే ఒళ్ళు కాలి పోతున్నది. గ్రూపు మేస్త్రీ వెంకటేశం వచ్చి చూశాడు. ''నేను నీ పెళ్ళాన్ని డాక్టరు తానకు తీసుకెళ్తా. నువ్వు పనిలో కెళ్ళు'' అన్నాడు.

జ్వరం వెంటనే తగ్గలేదు. ఏం రోగమో తెలియలేదు. అక్కడ మందులిచ్చిన డాక్టరు, పట్నంల చూపెట్టమన్నాడు. గోవిందుకు ఏమీ తోచకపోయింది. తనక్కడనుండి కదలటానికి వీలులేదు. ఆపైన తన దగ్గర పైసలు కూడా లేవు. అతనికి గ్రూపు మేస్త్రీ వెంకటేశం ఒక్కడే దిక్కుగా కన్పించాడు. వెళ్ళి అతని కాళ్ళమీద పడ్డాడు. రోగం సంగతలా ఉంచి ఇలా ఎన్నో రోజులు పనికి ఎగనామం పెడితే గ్రూపు మేస్త్రీగా వెంకటేశం సహించకూడదు. ఆమెకు బదులుగా మరెవరూ పనిలోకి వెళ్ళటం లేదు. కనుక రోజుకు ఆమెకొచ్చే జీతం యాభై రూపాయలు కోత వెయ్యాల్సిందే. కానీ, మానవ సంబంధాలు ఒక తీరున ఉండవు. రాజమ్మను దగ్గరగా పరిశీలించాక ఆమె అంటే ఒక విధమయిన ఆకర్షణ కలిగింది వెంకటేశానికి.

ఆమె నల్లగానే ఉంటుంది. ఆ నలుపులో ఓ నిగారింపు ఉంది. ఒక వెలుగు ఉంది. కనుముక్కు తీరు కుదురుగా ఉంటుంది.

''సర్లే! ఆ యమ్మను తీసుకెళ్ళి నేను బాగల్‌కోటలో చూపెడతాలే'' అన్నాడు వెంకటేశం.

ఆ మర్నాడు బాగల్‌కోటకు తీసుకెళ్ళాడు. బస్సు దాకా నడవటమే కష్టమయింది ఆమెకు.

రెండు రోజుల్లో తిరిగి వచ్చాడు. ఆస్పత్రిలో చేర్పించాడట, పరీక్షలయితేగానీ చికిత్స మొదలు పెట్టరని చెప్పాడు వెంకటేశం. గోవిందు నిస్సహాయుడు. తన భార్య ఎక్కడో పరాయిదేశంలో ఎలాగుందో తెలియదు. తను వెళ్ళలేడు. పని కూడా చెయ్యటం కష్టంగా ఉంది అతనికి. కానీ తప్పదు. ఆ మర్నాడు వెంకటేశం మళ్ళా బాగల్‌కోటకు వెళ్ళాడు. రెండు రోజుల తర్వాత తిరిగొచ్చి చెప్పాడు. ''ఆయమ్మకు గుండెల్ల ఇన్‌ఫెక్షనంట! నయమవుతుంది. కానీ పైసలు బాగా కర్సవుతయ్యంట!''

గోవిందు వెంకటేశం కాళ్ళమీద పడి బోరుమన్నాడు. ''నీవే దిక్కు'' అని చేత్తో నెత్తిన కొట్టుకుని ఏడ్చాడు.

''నువ్విట్లా అధైర్యపడితే జరిగేదేముంది! చూద్దాం. నా చేతనయింది చేస్తాను. రేపు ఇద్దరం బాగల్‌కోట వెళ్దాం. నీ పెండ్లాన్ని చూద్దువుగాని'' అన్నాడు వెంకటేశం.

మర్నాడు వెంకటేశంతో పాటు గోవిందు బాగల్‌కోట వెళ్ళాడు. అది పెద్ద ఊరే. పుట్టి బుద్దెరిగిన తర్వాత ఊరొదలి వెళ్ళనివాడు గోవిందు. ఒకసారి మాత్రం పాలమూరు వెళ్ళాడు. అక్కడ రాజమ్మ భర్తని చూసి ఏడ్చింది. వెంకటేశం డాక్టర్లతో మాట్లాడాడు. మందులు వాడటం మొదలెట్టారు. కనుక తొందర్లోనే తగ్గుతుందని చెప్పారని చెప్పాడు. సాయంత్రం మళ్ళా బయలుదేరి అల్మట్టికి తిరిగి వచ్చారు గోవిందు, వెంకటేశంలు.

వెంకటేశమయితే నాలుగు, మూడు రోజులకొకసారి బాగల్‌కోట కెళ్ళి ఆమెను చూసి వస్తూనే ఉన్నాడు.

''నువ్వింత అందంగుంటవు! నీకెక్కడ దొరికాడే ఆ మొగుడు'' అని అడిగాడో రోజు ఆమెను చూడటానికి వచ్చిన వెంకటేశం.

తన సౌందర్య ప్రశంస ఆమెకు ఆనందాన్ని కలిగించింది.


''మనిషెట్లుంటే ఏంది? ఆడి మనసు బంగారం'' అంది రాజమ్మ.

''ఆ బంగారం కర్సువెట్టి దవాఖానా బిల్లు కట్టు'' అన్నాడు వెంకటేశం.

''బిల్లు నువ్వే కడతావు. ఆడికేం పని? నీకేం ఆశ లేకనే నాకు మందులిప్పిస్తుండవా?''

''గట్లనయితే సరెలే. డాక్టర్ల నడిగినా. నిన్నుబయటకు తీసుకెళ్ళి తిప్పి తీసుకు రావొచ్చన్నరు. ఎళ్దాం తయారవ్వు''.

ఆమె తయారయి వచ్చింది. ఆ రోజు సినిమాకు తీసుకెళ్ళాడు. అప్పుడామెకు అతని కాంక్ష మరింత పరిచయమైంది. ఆమెకు రోగం నయమై, డాక్టర్లు డిశ్చార్జి చేసినా వాళ్ళు వారం రోజులపాటు బాగల్‌కోటలో ఉండిపోయారు. జల్సా చేశారు. రాజమ్మ జీవితంలో అంత సుఖమెప్పుడూ అనుభవించలేదు. ఇప్పుడామె



## అక్కా....బావ నచ్చాడు!

ఇది సినిమా టైటిల్ కాదు. నిజజీవితానికి సంబంధించిన డైలాగ్. శిల్పాశెట్టికి, బ్రిటన్ పారిశ్రామిక వేత్త రాజ్‌కుంద్రాకి పెళ్ళి కుదిరిన సంగతి తెలిసిందే! అయితే అక్క పెళ్ళి కుదిరిందన్న సంతోషంలో శిల్పా చెల్లెలు షమితా శెట్టి తలమునకలవుతోందట! ఎందుకంటే ఆ తరువాతి రేస్‌లో ఆమే ఉందిగా మరి! సహజంగా అక్క పెళ్ళి కుదిరిందంటే, మరి నీ పెళ్ళెప్పుడు? అని తెలిసిన వారందరూ అడుగుతుంటారు. కొందరు షమితాను కూడా అదే విధంగా అడిగారట! అక్క మొగుడు రాజ్‌కుంద్రా తనకు చాలా చాలా నచ్చాడని, అలాంటి వ్యక్తి దొరికితే వెంటనే పెళ్ళి చేసేసుకుంటానని సమాధానమిస్తోందట.

పేరు రాధ. తనే పేరు మార్చుకుందామె. అయితే వెంకటేశంతో కలిసినందుకు చెల్లించే మూల్యమేమిటో కూడా ఆమెకు తెల్సు. ఇప్పుడు తనకిష్టుడయిన భర్తని వదులుకోక తప్పదు. అయితే అది అతడి మనసుకు నొప్పి కలగకుండా జరగాలి. ఆసుపత్రి బిల్లు వెంకటేశమే భరించాలి. గోవిందు మిగిలిన బాకీ కూడా రద్దవ్వాలి. ఋణపత్రం తనకు వాపసు చెయ్యాలి. ఆమె ఏదడిగినా కాదనే స్థితిలో లేడు వెంకటేశం.

మర్నాడు ఇద్దరూ ఆల్మట్టికి వెళ్ళారు. ఆమె ఇప్పుడే పని చెయ్యటానికి వీలులేదు. డాక్టర్లు మందులు తీసుకుంటూ విశ్రాంతి తీసుకోవాలని చెప్పారనీ, లేకపోతే రోగం తిరగబెడు తుందనీ చెప్పాడు వెంకటేశం. ఆమెను బిజినేపల్లి పంపటానికి గోవిందు కూడా అంగీకరించాడు. తనే వెళ్ళి ఆమెను బస్సు ఎక్కించి వచ్చాడు గోవిందు. కూడల సంగమంలో వెంకటేశం ఆమెను దించుకున్నాడని అతనికి తెలియదు. తన భార్యను తిరిగి పూర్ణారోగ్యంతో తన కప్పగించినందుకు కృతజ్ఞుడై పోయాడు. తన జీవితాంతం అతనికి ఊడిగం చెయ్యటానికి సిద్ధపడ్డాడు.

వెంకటేశం ఇప్పుడు రాధతో కల్సి కూడల సంగమంలో కాపురం పెట్టాడు. కూడల సంగమం నుంచి రోజూ ఆల్మట్టికి వచ్చి వెళ్ళేవాడు. మధ్య దూరం పదిహేను కిలోమీటర్లు.


కూడల సంగమం పేరొందిన శైవక్షేత్రం. అది కృష్ణ, మాలప్రభ నదుల సంగమస్థానం. తను చేస్తున్నది పాపమో, పుణ్యమో ఆమెకు తెలీదు. ఊర్లో సంగమేశ్వరుడి ఆలయానికి వెళ్ళినప్పుడల్లా ఆమె మొక్కుకునేది, తన్ను మన్నించమని. ఆ మహా శైవ క్షేత్ర సంగమనాథుడిని రోజూ దర్శించుకుంది. ఒక్కసారిగా 6000 మంది కూర్చోటానికి అనువుగా ఉన్న సభా భవనం ఆమె కెంతో నచ్చింది. ఆ సభా భవన ద్వారాలకు శైవభక్తులు – గంగాంబిక, నీలాంబిక, చెన్నబసవన్న, అక్క నాగమ్మల పేర్లు పెట్టారు. అక్కడే మహాశివభక్తుడయిన బసవేశ్వరుడు లింగైక్యం పొందాడు. కృష్ణకు అటువైపున ఆయన భార్య నీలాంబిక సమాధి ఉన్నది. వెంకటేశం, రాధ ఓ సారి ఐహోలు కూడా దర్శించి వచ్చారు.

మరో ఐదు నెలలు గడిచినాయి. వర్షాకాలం రావటంతో, ఆ సీజనుకు పనులు ముగింపు పెట్టి, తమ తమ స్వంత గ్రామాలకు బయలుదేరారు వలస కూలీలు. వెంకటేశం కూడా ఇప్పుడు తనకక్కడేం పని లేక పోవటం వల్ల రాధను తీసుకుని మహబూబు నగరు వెళ్ళిపోయాడు.

వెంకటేశంతో కాపురం చేస్తున్న రాధ తన భర్తను మర్చిపోలేక పోయింది. గోవిందుకు తనంటే ఎంతిష్టమంటే, ''ముట్టుకుంటె నేను కందిపోతున్నట్టు చూసుకునెటోడు. పైసలుంటే పూలు, తినేటందుకు మిఠాయి పట్టుకొచ్చెటోడు. అత్త ఏదయినా పని చెప్పినా, 'ఏందే అమ్మా, అదేంజేసి ఏడవద్ది! ఏం జెయ్యాల్నో చెప్పు. నేజేస్త' అనెటోడు. 'బిడ్డా, గిట్ట నెత్తికెక్కించుకోకురో, పాలు మాలిన ఆడది అయిపోతాది' అని కొడుకును కసరుకొనేది ఆడి తల్లి. గతి తప్పి ఎంకటేశం తాన పనికి వచ్చినాక కూడా, ఇంటి కాడ పనిచేయని నాకు మోటుపని చేయక తప్పక పోవటంతో, రాత్రయ్యేసరికి జొరమొచ్చి నట్లయి పోయేది. ఆడు నేపండుకునేదాక కాళ్ళు వత్తెటోడు...' అలా యాదమ్మతో చెప్పుకుని ఏడ్చింది రాధ ఓసారి.

చిత్రంగా రాధకు వెంకటేశం అన్నా ప్రేమ కలిగింది. అతనిలో గోవిందుకున్న మృదుత్వం లేదు. అధికారం చెలాయిస్తాడు. తను చెప్పిన పని చెయ్యక పోతే రెండు తగిలించనూ కలడు. అప్పుడా క్షణంలో కోపంతో మూతి బిగించి అతను మళ్ళా బ్రతిమిలాడితే కానీ ప్రసన్నమవక పోయినా, ఆ తన్నులు, శాశించటాలూ కూడా కొత్తగా, ఆశించదగ్గవిగా కన్పించాయామెకు. మగవాడు దీనంగా ఉండకూడదు. శాశించాలి. పాలించాలి. అసలు మగవాడంటే అట్లా ఉండాలనిపించింది ఆమెకు. తనే అడుక్కునే వారు తన స్త్రీ కోసమేం చేయగలడు. పురుషుడు పని చెయ్యాలి, స్త్రీ అనుభవించాలి. స్త్రీ బయటి కొచ్చి పనిచేయటానికి పుట్టలేదు. ఈ భావాలు ఆమెలో ఎలా ఏర్పడ్డాయో ఆమెకే తెలియదు. అలాంటివి సహజాత భావాలయి ఉంటాయి. రాణి తేనెటీగకు తను తేనె పుట్టను ఏలాలని, కూలీ తేనెటీగలకు అవి నిరంతరం పని చెయ్యాలని ఎవరు నేర్పారు?

గోవిందు బిజినేపల్లికి వెళ్ళాడు. తన భార్య ఇంట్లో కన్పించక ఆమె ఎక్కడికి వెళ్ళిందని తండ్రినడిగాడు.




''అదేందిరా, బిడ్డా, నీతో వచ్చిన నీ పెండ్లాము సంగతి నన్నడుగుతావు?'' అని ఆశ్చర్యపోయాడు సైదులు.

''దానికి పెయ్య మంచిగలేకుంటే మందులిప్పించి, కోలుకుంటుందని చెప్పి ఇంటికి పంపినా'' అని సమాధానమిచ్చాడు గోవిందు.

రాజమ్మ పుట్టింటికెళ్ళి విచారించాడు. అలా అక్కడ విచారించటం తలనొప్పి పనయింది. పెళ్ళాన్ని వెంట తీసుకెళ్ళినవాడు తిరిగి తీసుకురాకుండా, తను ఆమెను ఐదు నెలల క్రితమే పంపాననటమేమిటి? అందరికీ అనుమానం కలగసాగింది. సరిగ్గా ఆ సమయం లోనే, ఓ గుర్తుపట్టలేని స్త్రీ శవం పక్క గ్రామ శివార్లల్లో లభ్యమవటంతో, గోవిందే అనుమానంతో పెళ్ళాన్ని హత్యచేశాడన్న పుకారు బయలుదేరింది. అత్తా-మామా గోవిందే తమ బిడ్డను హత్య చేశాడన్న నిర్ధారణకు వచ్చారు. పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. పోలీసులు గోవిందును అరెస్టు చేశారు. శవం ముఖం గుర్తు పట్టేట్టుగా లేదు. రాజమ్మ తల్లీదండ్రి ఆ శవంపై బడి భోరున విలపించారు. గోవిందుపై తిట్లవర్షం కురిపించారు. సైదులికి ఎటూ పాలుపోలేదు. తన కొడుకుది చీమకుట్టాడా హాని చెయ్యగల తత్వం కాదని అతనికి తెల్సు. కానీ సాక్ష్యాలన్నీ కొడుకు దోషి అనే చెప్తున్నాయి. దిక్కుతోచనివాడులా ఉండిపోయాడు అతడు.

ఈ వార్త పేపర్లలో వచ్చింది. రాధ పక్కింట్లో ఉంటున్న యాదమ్మ మొగుడు అది చదివాడు.

రెండు రోజుల తరువాత యాదమ్మ తీరిగ్గా చెప్పింది. ''విన్నావుటే, నీ అసలు మొగుణ్ణి పోలీసు నాకాలో పెట్టిరంట! మంచిగయింది. ఆడు జైలు కెళ్తడు. నువ్వు నీ మిండడితో సుకంగ ఉండు'' అంది.

రాధకు గుండెలు అవిసిపోయాయి. అతనికే హాని తలపెట్టలేదామె.

తేరుకున్నాక, ''ఎందుకట్లయిందే అక్కా!'' అని ఆమె భోరున విలపించసాగింది.

''ఛ, నోర్మూయ్యి. ఆడేదో చచ్చినట్టు ఏడుస్తున్నావు!''

''ఏమయిందక్కా! ఎందుకాడ్ని పోలీసునాకాలో పెట్టింద్రు?''

''మనుసుల్ని చంపితే ఊర్కుంటరుటమ్మ!''

''ఎవర్ని చంపిండు?''

''నిన్నే!''

''నన్ను చంపటమేందే?''

''నువ్వు ఊరు చేరలేదు. ఊర్ల ఒకాడదాని శవం దొరికిందట! దాని ముకం తెలవకుండా చెక్కేసింద్రంట! ఇంకేంది, మీ నాయనా, అమ్మ అది నీ శవమేనని లొల్లి చేసింద్రు, పోలీసు నాకాలో కంప్లయింటు చేసింద్రు. ఆళ్ళు తీసుకెళ్ళి ఈణ్ణి బొక్కలో ఏసింద్రు. చంపితివా లేదా అని ఉతికింద్రు. ఈడు చంపితినని ఒప్పుకుండె. ఇప్పుడు నువ్వు బయటపడితివా నీ గుట్టు రట్టవుతది. నీ అమ్మ, నాయనా నీ ముకం మీద ఊస్తరు, మొగడి నొదిలేసి పరాయోడితో లేచిపోయినందుకు. ఇంకోడి పెళ్ళామును లేవదీసుకు పోయినందుకు నీ ఉంచుకున్న మొగడ్ని బొక్కలో తోస్తరు. లేచి పోయిన నిన్ను నీ మగడు ఏలుకోడు. మా ఇంటోడు చెప్పిండు''.

ఇంక రాధకు ఏ పనీ చేయబుద్ధి కాలేదు. సాయంత్రం వెంకటేశం వచ్చిందాకా ఆత్రుతతో ఎదురు చూసింది. అతడు రావటంతోనే సంగతి చెప్పి భోరున విలపించింది.

“అవును, నేనూ విన్నాను. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తుంటి” అన్నాడు వెంకటేశం.

“నువ్వ ఆలోచిస్తుండు. ఆడ ఆడ్ని ఉరిదీస్తరు”

“నీ పరువు పోతుంది”

“నాకు పరువేంది? పరువు ముక్యమా, పేణం ముక్యమా? నేను చచ్చినా సరే ఆడిని జైలు నుండి తప్పించాలి”

“ఏందే, ఆడంటే అంత పడి ఏడుస్తుండవు, బొక్క లిరగ్గొడత!”

“ఆడి సంగతి నీకు తెలవదయ్యా! నేనింత జేసినా ఆడు నన్ను పల్లెత్తు మాటనడు. ఆడు దేవుడు, మనిషి కాదు”

“అయితే ఎళ్ళి ఆడితోనే ఉండు”

“లోకమంతా ఎదురయినా ఆడు కాదనడు, నే తిరిగి వస్తనంటే”

ఆ రోజంతా అలా వాదిస్తూ అతని చేతిలో దెబ్బలు కూడా తింది రాధ. వెంకటేశానికింక గత్యంతరం లేక పోయింది. బిజినేపల్లికి వెళ్ళాడు. ఇన్‌స్పెక్టరుతో మాట్లాడాడు. చెయ్యి తడిపాడు. రాధను బిజినేపల్లికి తీసుకెళ్ళక తప్పలేదు అతనికి. ఆమెను చూపించి బతికి ఉన్నదని నిరూపించాలి. రాధ తల్లీదండ్రీ తమ కూతురు బతికి ఉన్నందుకు సంతోషించారు. తప్పు చేసిందని లోకమంటుందని పైకి కూతుర్ని తిట్టినా, డబ్బున్న వెంకటేశాన్ని పట్టినందుకు సంతసించారు. సైదులు సిగ్గుతో బయటికడుగు పెట్టలేదు.

ఫార్మాలిటీస్ అన్నీ అయ్యాక, గోవిందును వదలి పెట్టారు పోలీసులు. పెళ్ళాన్ని చంపిన వాడని అందరూ అతణ్ణి వెలివేశారు. కన్నతండ్రే అతన్ని చూడటానికి పోలీసు స్టేషన్‌కి రాలేదు. పోలీసులు వది లేశాక నిస్సహాయంగా పోలీసు స్టేషనులోని చింత చెట్టుకు జారగిలబడి కూర్చున్న గోవిందుకేసి చూసిన ప్పుడు రాధ హృదయం ద్రవించిపోయింది. పెళ్ళాన్ని ఎందుకు చంపావో చెప్పమని పోలీసులు అతని ఒళ్ళు కుళ్ళబొడిచారు. లేవటానికి కూడా అతనికి ఓపిక లేదు. రాధ వెళ్ళి అతని భుజం మీద చెయ్యి వేసింది.

అతను తలెత్తి చూశాడు. ఒక్క క్షణం ఆనందం అతని కళ్ళల్లో తొణికిసలాడింది.

“ఎట్లున్నవు? మంచిగుంటివా?” అని అడిగాడు.

ఆమె తలూపింది. “నేనెళ్త, మరి!” అంది.

“తప్పదు గందా! ఎళ్ళు”

“నీ బాకీ తేర్చేసినా” అని ఆమె చింపేసిన ఋణ పత్రాన్ని అతని చేతిలో పెట్టింది.

అతనికి దాని మీద ఆసక్తిలేదు. ఆమె బాధ పడు తుందని అతడు దాన్ని స్వీకరించాడు.

“నాకు తెల్సు” అన్నాడు.

ఆమె అతన్ని వదల్లేక వదల్లేక వదలి వెళ్ళి పోయింది.

అతను ఆమె పోలీసుస్టేషను గేటు దాటి వెళ్తూంటే, గాజుకళ్ళతో ఆమె వంకే చూస్తుండి పోయాడు. తన బతుకు బాటనుండి గతించి పోయింది ఆమె. అతనెవర్నీ తప్పు పట్టలేదు. బతుకు లోని సంక్లిష్టతదే తప్పు.

న్యాయం విచిత్రమయింది. ఎడల్టరీ కేసు కింద వెంకటేశాన్ని శిక్షించవచ్చు. కానీ అందుకు బాధితుడు ఫిర్యాదు చెయ్యాలి. గోవిందుకు చట్టం తెలియదు. తెలిసినా అతడా పని చెయ్యడు. అతణ్ణి శిక్షిస్తే అది ఆమెకు శిక్ష. అది తనకు శిక్ష.

రాధ ఇప్పుడు గర్భవతి అని వెంకటేశానికి కూడా తెలియదు. ఇప్పుడామెకు పుట్టబోయే బిడ్డ కూడా ఉంది. తన బాగే కాదు, ఆ బిడ్డ భవిష్యత్తు కూడా చూసుకోవల్సిన బాధ్యత ఆమెపై ఉంది.

రాధ కారు డోరు తెర్చుకుని కూర్చుంది. ఆమె డోరు వెయ్యగానే కారు రివ్వున ముందుకు దూసుకు పోయింది.

అప్పుడే అక్కడికి వచ్చిన అతని తండ్రి సైదులు “తప్పు చేసిన ఆడదాన్తో ఏందిరా మాటలు!” అన్నాడు.


వచ్చి, కొడుకును చెయ్యి పట్టి లేవనెత్తాడు.

“అది తప్పు చెయ్యలేదు” అన్నాడు తీవ్రంగా గోవిందు, తండ్రి చెయ్యి విదిలించు కుంటూ, అయితే, ఆమె ఎలా తప్పు చెయ్యనట్టో చెప్పగలిగే పరిజ్ఞానం, చదువు అతనికి లేవు.

*

కవిత

# మెరుపు తునకల సాక్షిగా




వాడు,
వృత్తినీ ప్రవృత్తినీ అవలీలగా మేళవించి
అనాదిగా ‘హింసరక్కసి’కి నైచ్య నైవేద్యాలు సమర్పిస్తూ
‘గూండాగిరీ’ నేర సామ్రాజ్యంలో అడ్డూఅదుపూ లేక
పెట్రేగిపోతున్న ఆశయరహిత నరహంతక పాశవికుడు

అధికారరాజ్యపు ‘కోట’ బీటలు వారకుండా
స్వార్థపు ఉక్కుకవచాల ‘బిగి’ సడలకుండా
వాటంగా వాడుకోబడే ఒక ‘తురుపు ముక్క’ వాడు

రాజ్యం ‘వీర’భోజ్యం కాదు, ‘నేర’ భోజ్యం అన్న ‘నా’నుడి
ఇక్కడ తూచా తప్పక అమలుకాబడుతున్న ‘కటిక’ నిజం

వాణిజ్య ప్రకటన తీరులో
వాడి ముఖానికి తగిలించబడ్డ ముద్దుపేరు ‘మాఫియా’

అధికారం వెలగబెట్టేవాళ్ల తలలపై అధివసిస్తూ
అనుక్షణం వారి కదలికల్ని నియంత్రించే నిరంతర హింసాపథక రూపకుడు వాడు

సభల వేళా, ప్రచారవేళా, ఎన్నికల వేళా, పదవీస్వీకార ప్రమాణ వేళా, అన్ని వేళల్లో
జనం మేళాలో జనం మధ్యనే అనివార్యంగా సంచరించే అగోచరమాంత్రికుడు వాడు

ఒక్కసారిగా అవాంఛనీయ అపశృతులేవైనా దొర్లిన సందర్భాన
సహజత్వమో, కృత్రిమమో పోల్చుకోలేని అమాయిక జనం కూడా
అధికార కైవస ప్రయత్నంలో లాభంకూర్చే ‘తురుపుముక్కే’

***

నిస్వార్థ పాలక సింహాసనం సాఫీ మనుగడకు
తురుపుముక్కలుగా ఎవరూ వాడబడని సందర్భాన్ని సృష్టిస్తూ
ఒకానొక తెల్లారే తూరుపు ప్రసవించే ‘మెరుపుతునకల’ భావికిరణాల సాక్షిగా
నికార్సయిన జాతిజీవన స్రవంతిని కొనసాగిస్తూ
నిష్కల్మషంగా పదికాలాలు ప్రజలకాధారభూమికగా ప్రవర్థిల్లే
పవిత్ర రాజనీతిపీఠం జనం ముంగిట వెలసే రోజు కోసమే
కోటానుకోట్ల మెరుపుకళ్ల నీరాజనాలతో నిరంతర నిరీక్షణ

– శరత్ ప్రమోద్ ఎల్వీ

చిరునామా:
కాకాని చక్రపాణి
**6-1-149/10, ఫ్లాట్ నెం. 101,**
విశ్వంభర అపార్ట్‌మెంట్స్,
పద్మారావ్ నగర్, సికింద్రాబాద్ – **25.**
సెల్: **90006 11409**